
సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం । 24 । జూలై । 2024





## కొనసాగుతున్న వరద
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 1.65 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

వివరాలు IIలో ▸



## 'కల్కి' సందడి
పాలమూరులో 'కల్కి 2898 ఏడీ' సినీ బృందం సందడి చేసింది.

వివరాలు IIలో ▸

## వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.5 /23.2
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

# పాలమూరుకు మళ్లీ నిరాశే

- కేంద్ర బడ్జెట్‌లో ఊసేలేని 'పాలమూరు-రంగారెడ్డి' ఎత్తిపోతల ప్రస్తావన
- ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు దక్కని ప్రత్యేక కేటాయింపులు
- కొత్తగా రైల్వేలైన్ల ఏర్పాటుకు విముఖత
- ఆదాయపు పన్ను రాయితీ పెంచడంతో వేతన జీవులకు ఊరట
- కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు మొండిచేయి

సాక్షి, నాగర్‌కర్నూల్

కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై వివిధ వర్గాల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. ప్రధానంగా ఈసారి బడ్జెట్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లాకు ప్రత్యేకంగా ఎలాంటి కేటాయింపులు లేకపోవడం జిల్లావాసుల్ని నిరాశకు గురిచేసింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, కేంద్రం నుంచి ఇతోధికంగా నిధులు మంజూరవుతాయన్న జిల్లావాసుల ఆశలు అడియాశలుగానే మిగిలాయి. కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుపై కనీస ప్రస్తావన కరువైంది. కొత్తగా నిర్మించ తలపెట్టిన రైల్వేలైన్ల నిర్మాణంపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం ఉమ్మడి జిల్లావాసులను నిరాశకు గురిచేసింది. ఆదాయ పన్ను చెల్లించే స్లాబ్ పరిమితి పెంచడం ఉద్యోగ వర్గాలకు కాస్త ఊరట లభించినట్టయింది.

### 'పాలమూరు'కు అందని కేంద్ర సాయం..

ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో సుమారు 12.50 లక్షల ఎకరాలకు నీరందించేందుకు చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. మొదట రూ.35,200 కోట్ల వ్యయ అంచనాతో ప్రారంభమైన ప్రాజెక్టు పూర్తి కాకముందే ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.52,056 కోట్లకు పెరిగింది. ఇప్పటివరకు రూ.31 వేల కోట్ల విలువైన నిర్మాణపనులు పూర్తయ్యాయని ప్రభుత్వం చెబుతోంది. ఈ ప్రాజెక్టును పూర్తిచేసేందుకు ఇంకా కనీసం రూ.21 వేల కోట్లు అవసరం. ప్రాజెక్టు పెండింగ్‌లో ఉండడానికి ప్రధానంగా నిధుల కొరతే అడ్డంకిగా తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాకు ప్రతిష్టాత్మకమైన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ హోదాగా ప్రకటించి కేంద్ర సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కేంద్రాన్ని విజ్ఞప్తి చేసింది. ఈసారి బడ్జెట్‌లో కేంద్రం నుంచి కనీస సాయం అందుతుందని భావించింది. అయితే కేంద్ర బడ్జెట్‌లో ఆ ప్రాజెక్టు ప్రస్తావన సైతం లేకపోవడం ఈ ప్రాంతవాసుల్ని విస్మయానికి గురిచేసింది.

### వేతన జీవులకు ఊరట..



ఆదాయ పన్ను చెల్లింపు పరిమితి రూ.3 లక్షల వరకు పెంచడంతో ఉద్యోగులకు ఊరట లభించినట్లయింది. రూ.3 లక్షల నుంచి 7 లక్షల వరకు ఆదాయ పన్ను చెల్లింపు 5 శాతం మేరకే వసూలు చేయనున్నారు. రూ.7 లక్షలు దాటితే 10 శాతం ఆదాయ పన్ను విధించనున్నారు. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా మహిళాభివృద్ధికి, గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. మహిళల ఆస్తి రిజిస్ట్రేషన్లకు స్టాంప్‌డ్యూటీలో తగ్గింపు ఇవ్వనున్నారు. 'తరుణ్' పథకం కింద బ్యాంకుల ద్వారా అందించే ముద్రా రుణాలను గతంలో రూ.50 వేల నుంచి 10 లక్షల వరకు అందించగా, ఈ బడ్జెట్‌లో రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. దీంతో సూక్ష్మ, కుటీర పరిశ్రమలు, చిన్నతరహా వ్యాపార వర్గాలకు మేలు జరుగనుంది. విద్యార్థులు, నిరుద్యోగుల్లో ఉపాధి శిక్షణ నైపుణ్యాలను అందించేందుకు కొత్తగా ఐదు పథకాలను ప్రవేశపెట్టింది. ఉన్నత విద్య అభ్యసించేందుకు రూ.10 లక్షల వరకు రుణాల్ని మంజూరు చేయనున్నట్టు కేంద్రం ప్రకటించింది.

### తెలంగాణ ఊసేలేని బడ్జెట్



కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర ఊసే లేకుండాపోయింది. విభజన హామీలు, హక్కుగా రాష్ట్రానికి రావాల్సిన నిధుల ప్రస్తావన కూడా లేకపోవడం దారుణం. తెలంగాణ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రం ఎలాంటి భరోసా ఇవ్వలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా రాష్ట్ర ప్రజల ఆశలను అడియాశలు చేసింది. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కేంద్రాన్ని ప్రశ్నించాలి.

– జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి

### వెనుకబడ్డ ప్రాంతాలకు అన్యాయం..



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాల ప్రస్తావన లేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని ఎన్నోసార్లు విన్నవించాం. ఈ బడ్జెట్‌లో ప్రాజెక్టుకు ఎలాంటి సాయాన్ని ప్రకటించలేదు. కేంద్ర ప్రభుత్వం తమ కుర్చీని కాపాడుకునేందుకే ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఇచ్చినట్టు స్పష్టమవుతోంది. మొత్తానికి పాలమూరు జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేసింది.

– మల్లురవి, ఎంపీ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం

### పెండింగ్‌లోనే రైల్వేలైన్ల నిర్మాణం..

ఉమ్మడి జిల్లాలో కొత్తరైల్వే లైన్లు ఏర్పాటయ్యి ఇక్కడి ప్రజల ఏళ్లనాటి కల నెరవేరుతుందని భావించగా కేంద్ర బడ్జెట్‌లో ఈసారి నిరాశే మిగిలింది. గద్వాల-డోర్నకల్ నూతన రైల్వే లైన్‌తో పాటు గద్వాల-మాచర్ల రైల్వే లైన్, నారాయణపేట-కృష్ణా-వికారాబాద్ రైల్వేలైన్ తదితర రైల్వేలైన్ల నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. గత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు అవసరమైన రైల్వే లైన్లకు కేటాయింపులు లేకపోగా, ఈసారి కేంద్ర బడ్జెట్‌లో కొత్త రైల్వేలైన్లపై ఎలాంటి ప్రస్తావన రాలేదు.

### సామాన్యుల నడ్డివిరిచే బడ్జెట్..



కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డివిరిచే బడ్జెట్ ప్రవేశపెట్టింది. స్థిరాస్తులపై పన్నులు పెంచడం మోయలేని భారం. దీంతో రియల్‌ఎస్టేట్ రంగం కుదేలవుతుంది. బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావనే లేకపోవడం బాధాకరం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల, గద్వాల-మాచర్ల, డోర్నకల్-గద్వాల రైల్వేలైన్ల ఊసే లేదు. కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారు. ఏపీ విభజన చట్టంలో ఉన్న ఏ ఒక్క హామీ తెలంగాణకు ఇవ్వలేదు.

– గువ్వల బాలరాజు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

### అన్ని వర్గాల సంక్షేమం కోసం..



కేంద్ర బడ్జెట్ దేశ అభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి లబ్ధి చేకూర్చే విధంగా ఉంది. మహిళలు, యువత, రైతులు, పేద, మధ్య తరగతి వర్గాల సంక్షేమంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి కల్పనకు పెద్దపీట వేశారు. హైదరాబాద్ నుంచి బెంగళూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా తెలంగాణలోని 210 కిలోమీటర్ల భాగం ఉంటుంది. ఈ కారిడార్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధి అధికంగా ఉంటుంది.

– డీకే అరుణ, ఎంపీ, మహబూబ్‌నగర్

### కేంద్రానికి మద్దతు ఇస్తున్న రాష్ట్రాలకే ప్రాధాన్యం..



కేంద్రానికి మద్దతు ఇస్తున్న రాష్ట్రాలకే బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు ఎంతో కీలకమైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదాను పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఏ ఒక్క పథకానికి నిధులు కేటాయించకపోవడం దారుణం.

– కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే

### కేంద్రం రాష్ట్రానికి ఇచ్చింది శూన్యం



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఇచ్చింది గుండుసున్నా. ఈ బడ్జెట్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు. కేంద్రం తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకే కొన్ని రాష్ట్రాలకే నిధులు కేటాయించింది. తెలంగాణ నుంచి ఎంపీలను ఇచ్చినా బీజేపీ ఈ రాష్ట్రానికి ఏమీ చేయలేకపోయింది. కేంద్రప్రభుత్వ పక్షపాత బుద్ధితో రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోంది.

– కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

### తెలంగాణకు మొండిచెయ్యి..



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి మొండిచెయ్యి చూపించారు. రూ. 48.21 లక్షల కోట్ల బడ్జెట్‌లో ఏపీ, బీహార్ ఇతర మిత్రపక్షాల రాష్ట్రాలకు కేటాయింపులు జరిపి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను విస్మరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించకుండా ఇక్కడి ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. గద్వాల-మాచార్ల, కొత్త రైల్వే ప్రాజెక్టుల ఊసేలేదు. బడ్జెట్ ప్రాపర్టీ ట్యాక్స్ 12.5 శాతం పెంచడం సిగ్గుచేటు. దీన్ని వల్ల సామాన్యులపై తీవ్ర ఆర్థిక ప్రభావం పడుతుంది.

– డా.చిక్కుడు వంశీకృష్ణ, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కల్వకుర్తి పురపాలికలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బందితో పాటు మిగతా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తికి కారణమయ్యే దోమలు, ఈగల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కాలనీల్లో నిత్యం ఫాగింగ్ చేయించడంతో పాటు మురుగు కాల్వలు, వర్షపునీరు నిల్వ ఉండే చోట ఆయిల్ బాల్స్, దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్యలు, సీజనల్ వ్యాధులపై మంగళవారం మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణంలో నెలకొన్న సమస్యలపై ప్రజలు కమిషనర్‌కు ఫోన్‌చేయగా.. ఆయన ఓపిగ్గా సమాధానమిచ్చారు. – కల్వకుర్తి టౌన్/కల్వకుర్తి



'సాక్షి' ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

- మున్సిపాలిటీలో దోమలు, ఈగల నివారణకు ప్రత్యేక చర్యలు
- సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం.
- ప్రాధాన్యత క్రమంలో డ్రెయినేజీల నిర్మాణం
- కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన

సాక్షి ఫోన్ ఇన్

ప్రశ్న: ఈగలు అధికంగా ఉన్నాయి. వాటి నివారణకు చర్యలు చేపట్టాలి.
– సందీప్, 1వ వార్డు

కమిషనర్: పట్టణంలో వ్యర్థాలు జనరేట్ అయ్యే టిఫిన్ సెంటర్లు, హోటళ్లు తదితర దుకాణాలను తిరిగి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించాం. అందుకు తగినట్టుగా వారు శుభ్రత పాటించకపోతే తగు చర్యలు తీసుకుంటాం. ఈగలు వ్యాప్తి చెందకుండా పలు ద్రావణాలను పిచికారీ చేస్తున్నాం.

ప్రశ్న: మూడు వార్డుల మధ్యనున్న పద్మశ్రీనగర్ కాలనీలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. అలాగే కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటుచేయాలి.
– శ్రీకాంత్, పద్మశ్రీ నగర్

కమిషనర్: పద్మశ్రీ నగర్‌లో ఉన్న పలు సమస్యలను నోట్ చేసుకున్నాను. కాలనీలో డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసేలా ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశిస్తా. కాలనీలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: వీధిదీపాలు లేక ఇబ్బందులకు గురవుతున్నాం. సమస్యను పరిష్కరించాలి.
– నానియాదవ్, ఎన్జీఓ కాలనీ, సునీల్ కుమార్, గ్రీన్‌సిటీ కాలనీ

కమిషనర్: ఆయా కాలనీల్లో వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. రోడ్లపై మురుగు పారకుండా చూడటంతో పాటు విషసర్పాలకు ఆవాసంగా మారిన పొదళ్లను తొలగిస్తాం.

ప్రశ్న: మా కాలనీలో మురుగుకాల్వలు సరిగ్గా లేవు. దోమలతో రోగాలబారిన పడుతున్నాం.
– అబ్దుల్ కరీం, రాధాకృష్ణ కాలనీ

కమిషనర్: దోమల నియంత్రణకు ఇప్పటికే మున్సిపాలిటీలోని అన్ని కాలనీలలో రోజు ఫాగింగ్ చేస్తున్నాం. కాలనీల్లో ప్రాధాన్యత క్రమంలో మురుగుకాల్వల నిర్మాణం చేపడుతున్నాం. పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పట్టణంలో పలుచోట్ల పాత గోడలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వాటిని తొలగించాలి.
– నాగార్జున, కల్వకుర్తి

కమిషనర్: వానాకాలం ప్రారంభానికి ముందే పట్టణంలోని అన్ని కాలనీలలో వార్డు ఆఫీసర్లు తిరిగి శిథిలావస్థకు చేరిన పాత ఇళ్లు, గోడలను పరిశీలించారు. కాలనీల్లో ప్రమాదకరంగా మారిన పాత గోడలను తొలగిస్తాం. శిథిల ఇళ్లలో నివాసముంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తాం.

ప్రశ్న: పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రివేళ బయటికి రావాలంటే భయమేస్తుంది.
– ప్రశాంత్, ఇందిరానగర్, శివ, గాంధీనగర్,

కమిషనర్: పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని ఇప్పటికే పలువురు వినతులు ఇవ్వడంతో పాటు కాలనీల పర్యటనలో నా దృష్టికి వచ్చింది. వాటిని స్టెరిలైజ్ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇందిరానగర్ కాలనీలో రోడ్డు దెబ్బతిన్న విషయాన్ని నోట్ చేసుకున్నాను. త్వరలోనే కాలనీలో పర్యటించి అందుకు తగిన చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. పందుల సంచారం అధికంగా ఉంది.
– మజహర్, సుభాష్‌నగర్, కుర్మయ్య, బాలయ్య, మార్గదర్శి కాలనీ

కమిషనర్: మురుగు కాల్వలను వెంటనే శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లడంతో పాటు ఫాగింగ్ చేయిస్తాను. ఒరిగిపోయిన విద్యుత్ పోల్‌ను ఫొటో తీసి లొకేషన్ పంపిస్తే, అక్కడికి వచ్చి సమస్య పరిష్కరిస్తాం. మార్గదర్శి కాలనీలో పందుల నివారణకు చర్యలు చేపడతా.

ప్రశ్న: బస్టాండ్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న పాత ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో అక్కడి వ్యాపారులు వ్యర్థాలను పారబోస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాం.
– దామోదర్ రెడ్డి, 18వ వార్డు

కమిషనర్: పాత ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో చెత్తతో పాటు అక్కడి వ్యాపారులు వేస్తున్న వ్యర్థాలను నిత్యం మా సిబ్బంది తీసుకెళ్తున్నారు. వ్యర్థాలు పారబోసే వ్యాపారులకు ఫైన్లు విధించి, మరోమారు వ్యర్థాలు వేయకుండా చూస్తాం.

ప్రశ్న: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.
– ప్రవీణ్, సుభాష్‌నగర్

కమిషనర్: మున్సిపాలిటీలో దోమల నివారణ కోసం ప్రత్యేకంగా ఒకరిద్దరు సిబ్బందిని కేటాయించి నిత్యం ఫాగింగ్ చేస్తున్నాం. మురుగు కాల్వలు, వర్షపునీరు నిల్వ ఉండే చోట ఆయిల్ బాల్స్, సోడియం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్నాం.

ప్రశ్న: మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. మరమ్మతు పనులు చేపట్టాలి.
– అఖిల్, గాంధీనగర్

కమిషనర్: మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలు అలాగే ఉన్నాయి. వర్షం కారణంగా అక్కడ నీళ్లు నిల్వ ఉంటున్నాయన్న విషయం నా దృష్టికి వచ్చింది. త్వరలోనే మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో పర్యటించి సమస్య పరిష్కరిస్తాం.

## న్యూస్‌రీల్

### పొదుపు పద్ధతులపై అవగాహన అవసరం



లింగాల: పొదుపు పద్ధతులపై అందరికీ అవగాహన ఉండాలని లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్త కుంటపల్లిలో మంగళవారం సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ.. రిజర్వు బ్యాంక్ గుర్తించిన ఆర్థిక సంస్థల ద్వారా మాత్రమే ఆర్థిక వ్యవహారాలు కొనసాగించాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బ్యాంకుల్లో అందించే రుణ సదుపాయాలను సద్వినియోగపర్చుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎల్‌సీసీ జనార్దన్, సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు ఎండీ మన్సూర్, రూపేష్, మాజీ సర్పంచ్ పర్వతాలు, పీపీసీఎస్ డైరెక్టర్ బాలరాజుగౌడ్, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి



తిమ్మాజిపేటలో ప్రజాపాలన దరఖాస్తుల సవరణ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

బిజినేపల్లి: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం తిమ్మాజిపేటలో ప్రజాపాలన దరఖాస్తుల సవరణ కేంద్రం, రుణమాఫీ ఫిర్యాదుల విభాగాలతో పాటు యూబీఐలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. అంతకుముందు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ మొదటి విడతగా రూ. లక్ష లోపు రుణమాఫీ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన దరఖాస్తులను సవరించి, అర్హులందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500లకే సిలిండర్ అందేవిధంగా చూడాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించి సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా కలెక్టరేట్‌కు రావాలని ప్రజలకు సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా రూ. 9.5 లక్షలతో వంటగది నిర్మాణం, తరగతి గదుల మరమ్మతు పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

■ నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఆదర్శ పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. తిమ్మాజిపేట మండలం చేగుంట సమీపంలో నాగర్‌కర్నూల్ - మహబూబ్‌నగర్ ప్రధాన రహదారి పక్కన సర్వేనంబర్ 801లోని ప్రభుత్వ స్థలాన్ని చూసి, వివరాలు తెలుసుకున్నారు. ఆదర్శ పాఠశాల నిర్మాణానికి 20 ఎకరాల స్థలం అవసరమవుతుందని.. ఈమేరకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని తహసీల్దార్ జేకే మోహన్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట బిజినేపల్లి తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీఓలు లక్ష్మీదేవి, కథలప్ప, ఏఓ కమల్‌కుమార్ ఉన్నారు.

## ఆధునిక వ్యవసాయంతో రైతులకు లాభం



తాడూరు: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రైతులకు లాభం చేకూరుతుందని పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డా.మల్లారెడ్డి అన్నారు. తాడూరు మండలం ఇంద్రకల్ రైతువేదికలో మంగళవారం నూతన వంగడాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రకల్ గ్రామాన్ని దత్తత తీసుకున్నామని.. ప్రతినెలా రెండు సార్లు గ్రామాన్ని సందర్శించి సాంకేతిక సలహాలు, పంటల్లో చీడపీడల నివారణ, భూసార, నీటి పరీక్షలు, పంటమార్పిడి పద్ధతులు, కొత్త వంగడాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు విధిగా పాటించాలని రైతులకు సూచించారు. అనంతరం పత్తిలో ఎరువులు, పోషకాల యాజమాన్యం తదితర అంశాలపై పాలెం డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త పీహెచ్ భరత్ భూషణ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాలెం పరిశోధన కేంద్రం ప్రతినిధి డా.శశిభూషణ్, శంకర్, డా.శ్రీధర్, సైదయ్య, విజయ, సాయిరమేష్ కుమార్, శివ పాల్గొన్నారు.

## అర్హులందరికీ పంట రుణమాఫీ వర్తింపు



అంబట్‌పల్లిలో రుణమాఫీపై రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రశేఖర్

లింగాల: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం పంట రుణమాఫీ వర్తింపజేస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని అంబట్‌పల్లిలో మంగళవారం ఆయన రైతులను కలిసి రుణమాఫీపై ఆరా తీశారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. రుణమాఫీ జాబితాలో తమ పేర్లు లేవని అర్హులైన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండలంలో రూ. లక్ష లోపు రుణాలు ఉన్న రైతులు 1,400 మందికి పైగా ఉన్నారన్నారు. ప్రభుత్వం మొదటి విడతగా రూ.లక్ష లోపు రుణాల మాఫీ డబ్బులను విడుదల చేసిందని.. ఈనెలాఖరు వరకు రెండోవిడత.. ఆగస్టు 15వ తేదీ వరకు రూ. 2 లక్షల వరకు మాఫీ అవుతుందని అన్నారు. రుణమాఫీపై సందేహాలు ఉంటే మండల కేంద్రంలోని రైతువేదికలో సంప్రదించాలని రైతులకు సూచించారు. అనంతరం అంబట్‌పల్లి పీఏసీఎస్ కార్యాలయంలో రుణమాఫీ వివరాలను తెలుసుకున్నారు. రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలని సూచించారు. రూ. లక్ష లోపు రుణం ఉండి మాఫీ కాని రైతుల వివరాలను జిల్లా కార్యాలయానికి పంపించాలని తెలిపారు. కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చిన రైతులు బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డీఏఓ వెంట ఏఓ నాగార్జునరెడ్డి, ఏఈఓ శివానందు, సీఈఓ పాండు ఉన్నారు.

## పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

అచ్చంపేట రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోకల సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యారంగానికి నిధుల పెంపు, ఉపాధ్యాయుల జీపీఎఫ్ బకాయిలు, పీఆర్‌సీ తదితర బిల్లుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నందకిషోర్, నారాయణ, సుదర్శన్, విక్రమ్, భాస్కర్, కవిత, మాధవి, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

### సబ్సిడీ దూరం.. ధరలు భారం

- అటకెక్కిన యాంత్రీకరణ పథకం

వివరాలు IIIలో..

## క్లుప్తంగా

### ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికుడి ఆత్మహత్య


రమేష్(ఫైల్)

అయిజ: ఆర్థిక ఇబ్బందుల కారణంగా చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అయిజ మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని భరత్‌నగర్ కాలనీలో నివాసముంటున్న కాకె పరమేష్(52) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆర్థిక పరిస్థితి పూర్తిగా క్షీణించడంతో మనస్తాపానికి గురై సోమవారం అర్ధరాత్రి ఆయన నివాసంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే 1994–95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్ర బృందం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు.

### పురుగు మందు తాగి ఆత్మహత్య

మాగనూర్: మండలంలోని నేరడగం చెందిన మనిగిరి పెద్దకిష్టప్ప(43) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ అబ్దుల్ ఖాదర్ తెలిపిన వివరాల ప్రకారం.. మనిగిరి పెద్దకిష్టప్ప కొన్ని రోజులుగా మోకాళ్లు, నడుము నొప్పి తీవ్రమై బాధపడుతుండేవాడు. అదేవిధంగా కుటుంబ పోషణ భారమై మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి పడిపోగా, కుటుంబసభ్యులు గమనించి మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి డాక్టర్లు మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ పంపగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతిపై ఎలాంటి అనుమానం లేదని భార్య ఆశమ్మ తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### మహిళను వేధించిన వ్యక్తికి రిమాండ్

లింగాల: మండలంలోని కొత్తకుంటపల్లికి చెందిన ఏదుల రాముడుని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. రాముడు కొంత కాలంగా గ్రామానికి చెందిన ఓ మహిళను వేధింపులకు గురి చేస్తున్నాడని కేసు నమోదైందని ఎస్‌ఐ తెలిపారు. దానికి సంబంధించి కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ ఉత్తర్వులు ఇచ్చారని, ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అచ్చంపేట కోర్టులో హాజరు పరుచగా జడ్జి రిమాండ్ విధించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

### గుట్కా పాకెట్లు పట్టివేత



మక్తల్: మండలంలోని జక్లేర్‌లో మంగళవారం గుట్కా పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని ఇంట్లో నిషేధిత జర్దా, గుట్కా ప్యాకెట్లను నిల్వ ఉంచగా పక్కా సమాచారంతో దాడులు చేసినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. రూ.2.89లక్షలు విలువగల గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు.

### చెరువు, కుంటల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక తొమ్మిదో వార్డు పరిధిలోని పాలకొండ వద్ద పెద్దచెరువు ముంపు ప్రాంతాన్ని, ప్రగతినగర్ కాలనీని మంగళవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ డీఈఈ మనోహర్, రెవెన్యూ శాఖ ఆర్‌ఐ నర్సింగ్ తదితరులు పరిశీలించారు. వాస్తవానికి ఈ చెరువుకు ఇటీవల తూము, అలుగును పునరుద్ధరించడంతో నిండింది. అయితే సమీపంలో కొందరు ప్లాట్లు కొనుగోలు చేయగా అందులోకి వర్షపు నీరు చేరింది. దీంతో తూము తెరవాలని వారు అధికారులను కోరగా నిబంధనల ప్రకారం కుదరదని చెప్పారు. అనంతరం ఏనుగుండలో కబ్జాకు గురైన ఎల్లమ్మ కుంటను తనిఖీ చేశారు.

# బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

### పేదల వ్యతిరేక బడ్జెట్



కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా పేదల వ్యతిరేకంగా ఉంది. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలకు ప్రయోజనం లేదు. కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు సంతృప్తి పరచడం తప్ప దేశంలో ఉన్న ప్రజల కష్టాలను తీర్చే బడ్జెట్ కాదు. ఆహార ఉత్పత్తి ధరలు, 3.8 నుంచి 7.5 శాతంకు పెరిగాయి. గ్రామీణ ప్రాంతంలో 70 శాతంగా ఉన్న ఉపాధి కూలీలకు గత బడ్జెట్‌లో రూ.86వేల కోట్లు కేటాయించిందని, ఇప్పుడు కూడా అదే బడ్జెట్ కేటాయించి చేతులు దులుపుకున్నాయి. విద్య, వైద్యానికి నిధుల కేటాయింపుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద గతేడాది రూ.54వేల కోట్లు కేటాయించి, ఖర్చు మాత్రం రూ.32వేల కోట్ల మాత్రమే ఖర్చు చేశారు.

– మోహన్, టీపీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

### ఉద్యోగులు, వ్యాపారులకు లాభదాయకం



కొత్త బడ్జెట్‌తో ప్రభుత్వ ఉద్యోగులు, మధ్య తరగతి వ్యాపారులకు లాభదాయకం. గతంతో పోలిస్తే కొత్త పన్ను విధానంలో ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచారు. పన్ను చెల్లించే స్లాబ్‌లను సైతం రూ.3లక్షల నుంచి రూ.7లక్షల వరకు 5 శాతం పన్ను, రూ.7లక్షల నుంచి రూ.10 లక్షలకు 10 శాతం పన్ను, రూ.10లక్షల నుంచి రూ.15 లక్షలుంటే 15 శాతం పన్ను విధిస్తారు. కొత్త బడ్జెట్‌లో అమలు చేయనున్న కొత్త స్లాబ్‌లతో ఉద్యోగులతోపాటు మధ్య తరగతి వ్యాపారులకు ప్రయోజనం ఉంటుంది. పెద్ద వ్యాపారులకు అంతగా ప్రయోజనం లేదు.

– బాల్‌రాజ్, ఐటీ కన్సల్‌టెంట్, కోస్గి

సాక్షి, నెట్‌వర్క్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌పై పలు వర్గాల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. చిరు వ్యాపారులకు ముద్ర రుణాలు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్య, యువత కోసం నిధులు కేటాయించడంపై శుభపరిణామంగా భావిస్తున్నారు. అదేవిధంగా రాష్ట్రంలో బీజేపీకి 8 ఎంపీ స్థానాలు గెలిపించినా ఎలాంటి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంపై నిరాశ చెందారు. పేదలకు నష్టం కలిగించి, కార్పొరేట్‌కు అనుకూలంగా బడ్జెట్ ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.



### వ్యవసాయ రంగం, పరిశోధనలకు ప్రాధాన్యత



వ్యవసాయం రంగంలో ప్రత్యేకించి పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉత్పత్తి, నిల్వ సౌకర్యాలు సమకూస్తామన్నారు. సహకార రంగాన్ని క్రమబద్ధంగా బలోపేతం చేసేందుకు కొత్త జాతీయ సహకార విధానాన్ని ప్రవేశపెట్టాడం మంచిది. వ్యవసాయ అనుబంధ రంగాలకు వ్యవసాయ పనిముట్లు అందించేలా కేంద్రం కృషి చేసుంటే బాగుంటుంది. రైతులు ఇతర అద్దె పనిముట్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. పెట్టుబడులు పెరుగుతున్నాయి.

– పోశిరెడ్డి, రైతు, మానవపాడు

### నిరాశ పరిచిన బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆదాయ పన్ను స్లాబ్‌లలో పెద్ద మార్పు ఏమీ లేదు. వేతన జీవులకు కంటి తుడుపు చర్యగా రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచినా ఎలాంటి ఉపయోగం లేదు. పెరుగుతున్న ధరలకు తగ్గ ఆదాయాన్ని రూ.5 లక్షలకు పెంచితే బాగుండేది. ఇది ఉన్నత వర్గాల బడ్జెట్. పేదల బడ్జెట్ కానే కాదు.

– పి.చెన్నయ్య, జిల్లా అధ్యక్షుడు, బహుజన టీచర్స్ అసోసియేషన్, మహబూబ్‌నగర్

### విద్యపై సమగ్ర దృష్టి



ఈ బడ్జెట్ విద్యపై సమగ్ర దృష్టిని చూపిస్తుంది. ఇది సాంకేతిక అనుసంధానం, ఆర్థిక సులభత, నైపుణ్య అభివృద్ధిపై దృష్టి సారిస్తుంది. దేశం, ప్రపంచ విద్యా ప్రమాణాలకు సరిహద్దుగా చేరుకోవడానికి నడిపిస్తాయి. ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులకు ప్రోత్సహంగా రూ.10 లక్షల ఎడ్యుకేషన్ లోన్ ఇస్తుంది. ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులకు ఈ బడ్జెట్‌లో విద్య రంగంలో ఎంతో ఉపయోగకరంగా ఉందని నా అభిప్రాయం.

– చిన్న నర్సింహ, విద్యార్థి మాగనూర్

### తెలంగాణకు తీవ్ర అన్యాయం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది. పక్కనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.15వేల కోట్లతో వరాల జల్లు కురిపించి, తెలంగాణకు మొండిచేయి చూపించింది. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలున్నా రాష్ట్రానికి ఎలాంటి ప్రత్యేక నిధులు రాకపోవడం విడ్డూరంగా ఉంది. రాష్ట్రంలో పరిశ్రమలు, కొత్త ప్రాజెక్టుల అభివృద్ధి కోసం ఎలాంటి నిధులు విడుదల చేయలేదు. మొత్తానికి కొత్త బడ్జెట్‌లో పేదల నోట్లో మట్టి కొట్టి కేంద్రం పెద్దలకు దోచిపెట్టింది.

– కావలి మన్యం, అమరవీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

### రైతులకు నిరాశ



బడ్జెట్ పూర్తిగా రైతులకు నిరాశ మిగిల్చింది. పైగా కొన్ని రకాల మందులపై పన్నులు విధించడంతో భవిష్యత్‌లో వాటి ధరలు పెరుగుతాయి. అమ్మోనియ నైట్రేట్‌పై దిగుమతి సుంకం విధించడంతో వాటి ధరలు పెరుగుతాయి. రైతులు ఉపయోగించే ఎలక్ట్రికల్ పనిముట్లు తదితర అంశాలు ధరలు పెరుగుటకు అవకాశం ఉంది. ఏ ప్రభుత్వైన రైతులకు మేలు చేసేందుకు చూడాలి కాని ఈ ప్రభుత్వం కొంత కాలంగా రైతులు కష్టాలు, కన్నీళ్లే మిగిలుస్తుంది.

– శివరాజ్, రైతు, గుర్జాల్ గ్రామం, కృష్ణా మండలం

### ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం లేదు



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఉద్యోగస్తులకు కనీసం ఆదాయపు పన్ను మినహాయింపులో ఊరట లభిస్తుందని భావించాం.. కాని గతంలో మాదిరిగానే ఈ బడ్జెట్‌లో ఎలాంటి ప్రయోజనం లేకుండా చేసి మరోమారు మొండిచేయి చూపారు. రూ.5వేల స్టాండర్డ్ డిడక్షన్ పెంచాం అంటున్నా ఆర్థికమంత్రి అది కేవలం కొత్త పన్ను విధానం ఎంచుకున్న వారికే పరిమితం చేసి ఉద్యోగస్తులపై నిర్లక్ష్యాన్ని చాటుకున్నారు. కొత్త పన్ను విధానమే అశాస్త్రీయంగా ఉందనేది జగమెరగిని సత్యం.

– ఫారుఖ్ హుస్సేన్, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు

### ప్రజా సంక్షేమ బడ్జెట్



దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించడం కోసం రూ.48.21లక్షల కోట్లతో ఈ బడ్జెట్‌ను రూపొందించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.2.66 లక్షలు కోట్లతో పెద్దపీట వేశారు. హైదరాబాద్–బెంగళూర్ కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారు. ప్రజా సంక్షేమాన్ని పరిగణలోకి తీసుకుని ఈ బడ్జెట్ తయారు చేశారు. పట్టణాభివృద్ధితో పాటు వ్యవసాయ, మానవ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు.

– శాంతకుమార్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి

### వ్యాపారులు పెట్టుబడి సమస్య అధిగమిస్తారు



వ్యాపారం నిర్వహణలో చిన్న వ్యాపారులు పెట్టుబడులకు చాలా ఇబ్బందులు పడుతుంటారు. పెట్టుబడుల కోసం అధిక వడ్డీలకు ప్రైవేట్ అప్పులు తెచ్చుకొని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారు.
ఇలాంటి పరిస్థితులు ఉన్న నేపథ్యంలో కేంద్రం బడ్జెట్‌లో 'ముద్ర' కింద రుణ పరిమితిని రూ. 20లక్షలకు పెంచుతామని చెప్పడం వ్యాపారులకు ఆర్థికంగా ఎంతో ఊరట నిస్తుంది.

– వేణుగోపాల్, గద్వాల

### డిజిటలైజేషన్ హర్షణీయం



వ్యవసాయ రంగం అభివృద్ధిలో భాగంగా దేశంలో 400 జిల్లాలో డిజిటలైజేషన్ చేస్తామని బడ్జెట్‌లో పేర్కొనడం హర్షణీయం. వ్యవసాయ రంగానికి సాంకేతికతను అనుసంధానం చేయడం, వ్యవసాయ రంగం వేగంగా అభివృద్ధి చెంది, రైతులకు చాలా ప్రయోజనం చేకూరుతుంది. అదేవిధంగా వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో రూ.1.52లక్షల కోట్లు కేటాయించడం బాగుంది.

– సుదర్శన్‌రెడ్డి, రైతు, గద్వాల

### అన్ని వర్గాలకు ప్రాధాన్యత



అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్ కేటాయింపు చేయడం జరిగింది. హైదరాబాద్ నుంచి బెంగళూర్ ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ బడ్జెట్‌లో యువతకు ఉపాధి కల్పించే దిశగా అత్యధికంగా స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించారు. వ్యాపారంపై ఆధారపడి స్వయం ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులకు రూ.10లక్షల నుంచి రూ.20లక్షల వరకు ముద్ర రుణాలు పెంచడం మరింత పెట్టుబడి సాయం పొందే అవకాశం ఉంది.

–శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

### సంక్షేమానికి ప్రాధాన్యం



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమానికి అధికంగా ప్రాధాన్యమిచ్చినట్లు స్పష్టంగా కనబడుతుంది. మౌలిక సదుపాయాల కల్పనకు అధికశాతం నిధులు కేటాయించడమే ఇందుకు నిదర్శనం. వ్యవసాయ రంగానికి రూ.1.52 లక్షల కోట్లు, విద్యా, నైపుణ్యాభివృద్ధికి రూ.1.48 లక్షల కోట్లు కేటాయించడం ద్వారా రైతాంగం, విద్యార్థులు, యువత సంక్షేమానికి పెద్దపీట వేశారనేది అర్థమవుతోంది.

– ఎల్లేని సుధాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, నాగర్‌కర్నూల్

# జూరాలకు కొనసాగుతున్న వరద


జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- ప్రాజెక్టుకు 1.65లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- జూరాల వద్ద 36 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద జోరు కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టుకు 1.65లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు నుంచి 1,74,533 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 36 గేట్ల ద్వారా 1,41,696 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 43, కుడి కాల్వ ద్వారా 608, ఎడమ కాల్వకు 640, నెట్టెంపాడుకు 1,500, భీమా లిఫ్టు–1కు 1,300 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.682 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 1,28,763 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 91.828 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు సైతం ఇన్‌ఫ్లో పెరిగినట్లు అధికారులు చెప్పారు. ప్రాజెక్టుకు 1.50లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు వద్ద 25 గేట్లను ఎత్తి 1,43,500 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 27.927 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

**36.743 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి**

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి పరుగులు పెడుతుంది. మంగళవారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 36.743 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని పేర్కొన్నారు.

**నిండిన రామన్‌పాడు జలశయం**

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 736, సమాంతర కాల్వ ద్వారా 38 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 400 క్యూసెక్కులు, పలు లిఫ్టుల ద్వారా 195 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

**శ్రీశైలంలో నీటిమట్టం 842.4 అడుగులు**

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 842.4 అడుగుల నీటిమట్టం, 65.5 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,22,357 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 29,433 మొత్తం 1,51,790 క్యూసెక్కుల నీరు శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 977 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. భూగర్భ కేంద్రంలో 2.346 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 5,011 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 67 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

# ఒకరు వస్తే.. మరొకరు డుమ్మా



తోటి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న చిన్నారులు

- వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు
- చేసేదిలేక తోటివారికి పాఠాలు బోధిస్తున్న చిన్నారులు

మన్ననూర్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ డుమ్మాలు కొడుతుండటంతో విద్యార్థులే పంతుళ్లుగా వ్యవహరిస్తున్న తీరును చూసి వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్న 7తరగతులకు గానూ ఒక హెచ్ఎం, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. కొన్ని రోజులుగా ఉపాధ్యాయులు వంతుల వారీగా పాఠశాలకు వస్తున్నారు. ఒకరు వస్తే మరొకరు డుమ్మా కొడుతున్నారు. దీంతో విద్యార్థులకు తీవ్రంగా నష్టం జరుగుతోంది. చేసేదిలేక విద్యార్థులే పంతుళ్లుగా మారి తోటివారికి పాఠాలు బోధిస్తున్నారు. మంగళవారం గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఇమ్మడి కుమార్, చారగొండ ప్రభాకర్, సూర్యం పాఠశాల వద్దకు వెళ్లి ఉపాధ్యాయుల గైర్హాజరుపై ఆరా తీశారు. 10 గంటల తర్వాత ఒకరు మాత్రమే వచ్చినట్లు వారు వివరించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా పాఠశాలకు రావడం, డుమ్మాలు కొట్టడం చేస్తున్నారని ఆరోపించారు. పాలకుల, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా విషయంపై హెచ్ఎంను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# ఎన్టీఆర్ కళాశాలలో షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్



మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ సుస్థిరతపై పూర్తిస్థాయిలో ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేక షార్ట్‌ఫిల్మ్, పాంప్లెట్స్ తయారు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణ కోసం చట్టాలను సైతం పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ప్రకృతికి సంబంధించి 18 షార్ట్‌ఫిల్మ్‌లు, 12 గ్రీన్ ఫిల్మ్‌లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఏటీఎం చోరీకి విఫలయత్నం

- పోలీస్ సైరన్ మోగడంతో గ్యాస్ సిలిండర్, కట్టర్లు వదిలేసి వెళ్లిన వైనం



ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న పోలీసులు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలో ఏటీఎం చోరీ చేసేందుకు వెళ్లి పోలీస్ సైరన్ విని దుండగులు పారిపోయారు. సీఐ నాగభూషన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణం పెబ్బేరు రోడ్డులోని మారుతి షోరూం పక్కన గల ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఆక్సిజన్, గ్యాస్ సిలిండర్లు, కట్టర్ పరికరాలతో వచ్చారు. షెట్టర్‌ను తెరిచి లోపలికి వెళ్లి తిరిగి మూసేందుకు ప్రయత్నించగా, అది సాధ్యం కాకపోవడంతో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసుల సైరన్ విని చోరీకి తెచ్చిన పరికరాలు అక్కడే వదిలి పారిపోయారు. మంగళవారం ఉదయం డీఎస్పీ వెంకటేశ్వరావు, ఎస్ఐ రామరాజు, క్లూస్ టీం పరిశీలించారు. అక్కడే వదిలి వెళ్లిన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



# పాలమూరులో కల్కి సందడి

- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 'బుజ్జి'
- సెల్ఫీలతో యువత హుషారు
- జిల్లాకు రావడం సంతోషంగా ఉంది
- డైరెక్టర్ నాగ్ అశ్విన్


మాట్లాడుతున్న డైరెక్టర్ నాగ్ అశ్విన్


'బుజ్జి'ని ఆసక్తిగా తిలకిస్తున్న యువత

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు పట్టణంలో మంగళవారం కల్కి టీం సందడి చేసింది. డైరెక్టర్ నాగ్ అశ్విన్‌తో పాటు ప్రొడక్షన్ సిబ్బంది తదితరులు మంగళవారం పట్టణానికి వచ్చారు. ఈ క్రమంలో సినిమాలో యువతను ఎంతగానో ఆకర్షించిన 'బుజ్జి' (కారు) సందడి చేసింది. బుజ్జిని మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ప్రదర్శనకు ఉంచారు. దీంతో యువత బుజ్జిని చూసేందుకు భారీగా మైదానానికి తరలివచ్చారు. ఆసక్తిగా తిలకించారు. చిన్నారుల నుంచి మొదలు అన్ని వయసుల వారు తరలిరావడంతో మైదానం సందడిగా మారింది. యువత 'బుజ్జి'తో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. ఆరున్నర టన్నుల బరువుగల ఈ బ్యాటరీ వాహనంలో ఎంతో ప్రత్యేకతలు ఉన్నాయి. డైరెక్టర్ నాగ్ అశ్విన్ సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ కావడంతో పాటు బుజ్జి వాహనాన్ని ఇక్కడికి తీసుకురావాలన్న అభిమానుల కోరిక మేరకు ప్రదర్శనకు ఉంచినట్లు ప్రొడక్షన్ టీం తెలిపింది. మూడు భారీ టైర్లతో, ఎలక్ట్రికల్ బ్యాటరీ సాయంతో ఈ వాహనం నడుస్తుందని వారు తెలిపారు. చార్జీ చేస్తే 50 కిలోమీటర్ల వరకు, టాప్ స్పీడ్ 40కిలోమీటర్లతో నడుస్తుందన్నారు. కాగా వాహనం పొడవు 19ఫీట్లు, ఎత్తు 12ఫీట్లు ఉన్నట్లు తెలిపారు. వాహనం చుట్టూ 360 డిగ్రీల కెమెరాలు ఉంటాయని వివరించారు. తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్‌లోని, హైదరాబాద్‌లో ప్రదర్శన అనంతరం మహబూబ్‌నగర్‌కు తీసుకొచ్చినట్లు వివరించారు. స్థానిక ఎస్‌వీఎస్ కళాశాలలో విద్యార్థులతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

### మన జిల్లాకు రావడం సంతోషంగా ఉంది: నాగ్ అశ్విన్

కల్కి సినిమా డైరెక్టర్ నాగ్ అశ్విన్ జిల్లా కేంద్రంలోని ఏవీడీ సినిమాస్ (థియేటర్)కు చేరుకోగా ఆయనను చూడడానికి యువత, అభిమానులు ఎగబడ్డారు. ఈ సందర్భంగా అభిమానులనుద్దేశించి ఆయన మాట్లాడారు. తమ ఫ్యామిలీ అందరూ ఇక్కడి వారే కావడం, కల్కి సినిమా ఇక్కడ పెద్దగా ఆడడం ప్రత్యేకంగా ఉందన్నారు. రెబల్‌స్టార్ ప్రభాస్ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. బుజ్జి వాహనాన్ని దేశమంతా తిప్పి మహబూబ్‌నగర్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. మన జిల్లాకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. పార్ట్–2 సినిమాకు ఇంకా సమయం ఉందని వివరించారు. అనంతరం ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో బుజ్జి వాహనంపై ఎక్కి అభిమానులకు అభివాదం చేశారు.

సాక్షి
# స్పోర్ట్స్
బుధవారం
24-7-2024

## బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు... 'ఖేలో ఇండియా'కే రూ. 900 కోట్లు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం క్రీడలకు ఇచ్చే వార్షిక బడ్జెట్‌ను స్వల్పంగా పెంచింది. మంగళవారం ప్రకటించిన 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు కేటాయించింది. గత ఏడాది ఇచ్చిన రూ.3,396.96 కోట్లతో పోలిస్తే ఇది రూ.45.36 కోట్లు ఎక్కువ. ఎప్పటిలాగే ఇందులో ఎక్కువ మొత్తం దిగువ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దే 'ఖేలో ఇండియా' పథకానికే కేటాయించింది. గత ఏడాదికంటే రూ.20 కోట్లు ఎక్కువగా 'ఖేలో ఇండియా'కు ఈసారి రూ.900 అందిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా యూత్ గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్‌ల నిర్వహణతో పాటు అత్యుత్తమ స్థాయి శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, అక్కడ సౌకర్యాల కల్పన కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తారు. మరోవైపు దేశవ్యాప్తంగా స్టేడియాల నిర్వహణ, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) కోసం ఖర్చు చేసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు ప్రభుత్వం రూ.822.60 కోట్లు కేటాయించింది. దేశంలోని వివిధ క్రీడా సమాఖ్యలకు ఈ సారి రూ.340 కోట్లు అందజేస్తున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా), జాతీయ డోపింగ్ టెస్టింగ్ లేబొరేటరీ (ఎన్‌డీటీఎల్)ల కోసం వరుసగా 21.73 కోట్లు, రూ. 22 కోట్లు చొప్పున కేటాయించారు.

# అజేయంగా సెమీస్‌లోకి

- భారత మహిళల జట్టుకు 'హ్యాట్రిక్' విజయం
- రాణించిన షఫాలీ వర్మ, హేమలత, అరుంధతి


షఫాలీ

దంబుల్లా: అటు బ్యాటింగ్‌లో... ఇటు బౌలింగ్‌లో అదరగొట్టిన భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా కప్ టి20 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. నేపాల్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 82 పరుగుల తేడాతో గెలిచింది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత జట్టు ఆరు పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి తీసుకోవడంతో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 178 పరుగులు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (48 బంతుల్లో 81; 12 ఫోర్లు, 1 సిక్స్), హేమలత (42 బంతుల్లో 47; 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 122 పరుగులు జోడించారు. 179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు పడగొట్టగా... హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి, రాధా యాదవ్ 2 వికెట్ల చొప్పున తీశారు. గ్రూప్ 'ఎ'లోని మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ 10 వికెట్ల తేడాతో యూఏఈ జట్టును ఓడించింది. 4 పాయింట్లతో గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంతో పాకిస్తాన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. నేడు జరిగే గ్రూప్ 'బి' చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో మలేసియాతో బంగ్లాదేశ్; థాయ్‌లాండ్‌తో శ్రీలంక తలపడతాయి.

### స్కోరు వివరాలు

**భారత ఇన్నింగ్స్:** షఫాలీ వర్మ (స్టంప్డ్) కాజల్ శ్రేష్ఠ (బి) సీతా రాణా మగర్ 81; హేమలత (సి) రుబీనా ఛెత్రి (బి) సీతా రాణా మగర్ 47; సజన (ఎల్బీడబ్ల్యూ) (బి) కబితా జోషి 10; జెమీమా రోడ్రిగ్స్ (నాటౌట్) 28; రిచా ఘోష్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1-122, 2-133, 3-156. **బౌలింగ్:** కబితా కున్వర్ 2-0-20-0, షబ్నమ్ రాయ్ 4-0-41-0, పూజా మహతో 1-0-13-0, కబితా జోషి 4-0-36-1, రుబీనా ఛెత్రి 1-0-14-0, ఇందూ బర్మ 4-0-29-0, సీతా రాణా మగర్ 4-0-25-2. **నేపాల్ ఇన్నింగ్స్:** సంజానా ఖాడ్కా (బి) అరుంధతి రెడ్డి 7; సీతా రాణా మగర్ (బి) అరుంధతి రెడ్డి 18; కబితా కున్వర్ (సి) స్మృతి మంధాన (బి) రేణుక 6; ఇందూ బర్మ (సి) షఫాలీ (బి) రాధా యాదవ్ 14; రుబీనా ఛెత్రి (బి) దీప్తి శర్మ 15; పూజా మహతో (రనౌట్) 2; కబితా జోషి (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి శర్మ 0; బిందూ రావల్ (నాటౌట్) 17; డాలీ భట్టా (సి) రిచా ఘోష్ (బి) రాధా యాదవ్ 5; కాజల్ శ్రేష్ఠ (సి అండ్ బి) దీప్తి శర్మ 3; షబ్నమ్ రాయ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 96. వికెట్ల పతనం**: 1-8, 2-21, 3-43, 4-52, 5-64, 6-64, 7-70, 8-82, 9-93. **బౌలింగ్:** రేణుక సింగ్ 4-1-15-1, అరుంధతి రెడ్డి 4-0-28-2, తనూజా కన్వర్ 4-1-12-0, దీప్తి శర్మ 4-0-13-3, రాధా యాదవ్ 3-0-12-2, సజన 1-0-11-0.



ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రీడాకారులు పారిస్‌కు చేరుకున్నారు. భారత మహిళా బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా, ప్రీతి, జైస్మిన్... బ్యాడ్మింటన్ స్టార్ సాత్విక్ సాయిరాజ్ అక్కడి ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. క్రీడా గ్రామంలో టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్‌ను సాత్విక్ సాయిరాజ్, భారత టీటీ ప్లేయర్ సత్యన్ జ్ఞానశేఖరన్ కలిసి అతనితో ఫొటోలు దిగారు.



# వీళ్ల ఆటను చూడాల్సిందే!

## పారిస్ ఒలింపిక్స్‌లో పలువురు దిగ్గజాలు ● చరిత్ర సృష్టించేందుకు సిద్ధం

జీవితంలో ఒక్కసారి ఒలింపిక్స్‌లో పోటీపడితేనే తమ జీవితాశయం నెరవేరినట్లు చాలా మంది క్రీడాకారులు భావిస్తారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని కొందరు జాతీయ హీరోలుగా ఎదుగుతారు. ఒలింపిక్స్ పేరును ఎప్పుడు ప్రస్తావించినా తమ పేరును కూడా స్మరించుకునే విధంగా చరిత్రకెక్కుతారు. తమ అద్వితీయమైన ప్రదర్శనతో తమకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖిస్తారు. ఒలింపిక్స్‌లో పోటీపడటాన్ని... పతకాలను సాధించడాన్ని... ప్రపంచ రికార్డులు సృష్టించడాన్ని అలవాటుగా మార్చుకొని ఎవరికీ అందనంత ఎత్తులో నిలుస్తారు. మరో రెండు రోజుల్లో మొదలయ్యే పారిస్ ఒలింపిక్స్‌లోనూ పలు క్రీడాంశాల్లో దిగ్గజాలు మరోసారి తమ విన్యాసాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. అందులో కొందరి గురించి క్లుప్తంగా...

-సాక్షి క్రీడా విభాగం



మరో 2 రోజుల్లో...

### సిమోన్ బైల్స్ (జిమ్నాస్టిక్స్)

మెరుపు తీగలా కదులుతూ... అలవోకగా పతకాలు గెలుస్తూ... ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో తనదైన ముద్ర వేసింది అమెరికాకు చెందిన సిమోన్ బైల్స్. 27 ఏళ్ల బైల్స్ వరుసగా మూడో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనుంది. 4 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న బైల్స్ ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో 4 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 23 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్యాలు కైవసం చేసుకుంది. 'పారిస్'లో బైల్స్ మరో పతకం నెగ్గితే ఒలింపిక్స్ చరిత్రలో అత్యధిక పతకాలు నెగ్గిన అమెరికన్ జిమ్నాస్ట్‌గా రికార్డు నెలకొల్పుతుంది. బైల్స్ ఐదు పతకాలు గెలిస్తే... ఒలింపిక్స్ చరిత్రలోనే 12 పతకాలతో అత్యధిక పతకాలు నెగ్గిన జిమ్నాస్ట్‌లలో లారిసా లాతినినా (రష్యా; 18 పతకాలు) తర్వాత రెండో స్థానానికి చేరుకుంటుంది.

### మిజైన్ లోపెజ్ నునెజ్ (రెజ్లింగ్)



గ్రీకో రోమన్ స్టయిల్‌లో ఎదురులేని దిగ్గజ రెజ్లర్. క్యూబాకు చెందిన 41 ఏళ్ల నునెజ్ వరుసగా ఆరో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్నాడు. ఇప్పటికే వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణ పతకాలను సాధించాడు. 6 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న నునెజ్ పురుషుల గ్రీకో రోమన్ 130 కేజీల విభాగంలో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా ఉన్నాడు. 2004 ఏథెన్స్‌లో 120 కేజీల విభాగంలో ఐదో స్థానంలో నిలిచిన నునెజ్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 2008 బీజింగ్, 2012 లండన్ ఒలింపిక్స్‌లలో 120 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించాడు. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లలో 130 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలను గెల్చుకున్నాడు. పారిస్ గేమ్స్‌లోనూ నునెజ్ పతకం సాధిస్తే... ఒలింపిక్స్ రెజ్లింగ్ చరిత్రలో ఐదు స్వర్ణాలు లేదా ఐదు పతకాలు నెగ్గిన ఏకైక రెజ్లర్‌గా ఘనత వహిస్తాడు.

### ఎలూడ్ కిప్‌చోగి (అథ్లెటిక్స్)



లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్‌లో ఆఫ్రికా అథ్లెట్లకు తిరుగులేదు. పారిస్ ఒలింపిక్స్‌లో కెన్యాకు చెందిన 39 ఏళ్ల ఎలూడ్ కిప్‌చోగి గతంలో మారథాన్‌లో ఎవరికీ సాధ్యంకాని రికార్డును సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాడు. ఐదోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్న కిప్‌చోగి 2004 ఏథెన్స్ గేమ్స్‌లో 5000 మీటర్లలో కాంస్యం, 2008 బీజింగ్ గేమ్స్‌లో 5000 మీటర్లలో రజతం సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌కు అర్హత పొందలేకపోయిన కిప్‌చోగి ఆ తర్వాత మారథాన్ (42.195 కిలోమీటర్లు) వైపు మళ్లాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కిప్‌చోగి విజేతగా నిలిచి రెండు స్వర్ణాలు సాధించాడు. ఈ క్రమంలో అబెబె బికిలా (ఇథియోపియా), వాల్డెమర్ (జర్మనీ) తర్వాత ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో రెండు స్వర్ణాలు నెగ్గిన మూడో అథ్లెట్‌గా నిలిచాడు. పారిస్‌లోనూ కిప్‌చోగి పతకం లేదా స్వర్ణం నెగ్గితే ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో అత్యధికంగా మూడు పతకాలు నెగ్గిన ఏకైక అథ్లెట్‌గా చరిత్ర సృష్టిస్తాడు.

### లెబ్రాన్ జేమ్స్ (బాస్కెట్‌బాల్)



ఒలింపిక్స్‌లో బాస్కెట్‌బాల్‌ను 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ క్రీడాంశంలో అమెరికాయే తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. 1980 మాస్కో ఒలింపిక్స్‌ను బహిష్కరించిన అమెరికా జట్టు ఇప్పటి వరకు బాస్కెట్‌బాల్‌లో 16 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన అమెరికా ఆ తర్వాత వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణాలు సాధించింది. మరో స్వర్ణమే లక్ష్యంగా అమెరికా పారిస్ గేమ్స్‌లో అడుగు పెడుతుంది. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లీగ్ చరిత్రలో టాప్ స్కోరర్‌గా ఉన్న లెబ్రాన్ జేమ్స్ నాలుగోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్నాడు. 2012 లండన్ ఒలింపిక్స్ తర్వాత మళ్లీ విశ్వ క్రీడల్లో ఆడుతున్న లెబ్రాన్ జేమ్స్ తన సహజశైలిలో ఆడితే ఈసారీ అమెరికాకు ఎదురుండదు.

### టెడ్డీ రైనర్ (జూడో)



పురుషుల జూడో క్రీడాంశంలో 12 సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఫ్రాన్స్ దిగ్గజం టెడ్డీ రైనర్ సొంతగడ్డపై రికార్డుపై గురి పెట్టాడు. వరుసగా ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న 35 ఏళ్ల టెడ్డీ రైనర్ ఒలింపిక్స్‌లో 3 స్వర్ణాలు, 2 కాంస్యాలు సాధించాడు. 6 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న టెడ్డీ పారిస్ ఒలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్‌తోపాటు హెవీ వెయిట్ విభాగంలో బరిలోకి దిగుతాడు. ఈ రెండు విభాగాల్లోనూ టెడ్డీ స్వర్ణాలు సాధిస్తే ఫ్రాన్స్ తరఫున ఒలింపిక్స్ క్రీడల్లో అత్యధికంగా ఐదు స్వర్ణాలు గెలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఫ్రాన్స్ ఫెన్సర్లు లూసియన్ గాడిన్, క్రిస్టియన్ డోరియోలా గతంలో ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణాల చొప్పున సాధించారు.

బైల్స్, లెబ్రాన్ జేమ్స్, కిప్‌చోగి, టెడ్డీ రైనర్, నునెజ్‌లే కాకుండా పోల్‌వాల్టర్ డుప్లాంటిస్ (స్వీడన్), టేబుల్ టెన్నిస్‌లో మా లాంగ్ (చైనా), స్విమ్మింగ్‌లో సెలెబ్ డ్రెసెల్ (అమెరికా), కేటీ లెడెకీ (అమెరికా) కూడా పారిస్ ఒలింపిక్స్‌లో కొత్త చరిత్రను లిఖించే దారిలో ఉన్నారు. వారందరికీ ఆల్ ద బెస్ట్!

# సినిమా

## రెప్పల్ డప్పల్


● రవితేజ

హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రధారులు. పనోరమా స్టూడియోస్ అండ్ టి-సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రెప్పల్ డప్పల్...' అంటూ సాగే రెండో పాట లిరికల్ వీడియోను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

## మళ్లీ ఎటో వెళ్లిపోయింది మనసు...

ప్రేమకథలను ఇష్టపడే వారి జాబితాలో 'ఎటో వెళ్లిపోయింది మనసు' (2012) సినిమా కూడా ఉంటుంది. నాని, సమంత లీడ్ రోల్స్‌లో నటించగా, గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. రేష్మా, ఎస్. వెంకట్, సి. కల్యాణ్, సీవీ రావు నిర్మించిన ఈ సినిమాకు ఇళయరాజా అందించిన బాణీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా 'ఎటో వెళ్లిపోయింది మనసు' సినిమా రీ రిలీజ్ కానుంది. లక్ష్మీ నరసింహా మూవీస్ బ్యానర్ మీద సుప్రియ, శ్రీనివాస్ ఆగస్టు 2న ఈ సినిమాను మళ్లీ విడుదల చేయనున్నారు. ''ప్రస్తుతం తెలుగులో రీ-రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తోంది. ఈ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు నిర్మాతలు.


● సమంత
నాని

## మరో ప్రేమకథ ఆరంభం


● నయనతార

ఇప్పటివరకూ పలు ప్రేమకథా చిత్రాల్లో నటించారు నయనతార. తాజాగా సిల్వర్ స్క్రీన్‌పై మరో రొమాంటిక్ లవ్ స్టోరీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారీ బ్యూటీ. తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన విష్ణు ఎడవన్ ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ లవ్‌స్టోరీ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మధ్య వయస్కురాలైన ఓ మహిళ, ఓ కుర్రాడి మధ్య ఉన్న ప్రేమ బంధాన్ని నేటి సమాజం ఎలా చూస్తుంది? అనేది ఈ చిత్రం ప్రధానాంశమని కోలీవుడ్ సమాచారం. మధ్యవయస్కురాలి పాత్రలో నయనతార, కుర్రాడి పాత్రలో కెవిన్ కనిపిస్తారు. ప్రస్తుతం నయనతార, కెవిన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు దర్శకుడు విష్ణు. లలిత్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

## మేమే... మేమే...


● సూర్య

'ఆది జ్వాల... అనంత జ్వాల... వైర జ్వాల... వీర జ్వాల.. దైవ జ్వాల... దావాగ్ని జ్వాల...' అంటూ మొదలవుతుంది 'కంగువా' సినిమాలోని ఫైర్ సాంగ్. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రలు పోషించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 10న విడుదల కానుంది. మంగళవారం సూర్య బర్త్ డే సందర్భంగా 'కంగువా' సినిమాలోని 'ఫైర్ సాంగ్' లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''ఈ మట్టి ముట్టే ముందే ఇక్కడ పుట్టింది మేమే మేమే... అంకెలు పుట్టక ముందే లెక్కలు కనిపెట్టింది మేమే మేమే...' అనే లిరిక్స్‌తో సాగే ఈ పాట తెలుగు వెర్షన్‌కు శ్రీమణి సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, దీప్తీ సురేష్ ఆలపించారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

**ది వన్...** హీరో సూర్య, దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్య బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ వీడియోలో 'ది వన్' అని ఉంది. దాంతో ఈ సినిమా టైటిల్ 'ది వన్' అనే ప్రచారం జరుగుతోంది. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రాన్ని జ్యోతిక, సూర్య, కార్తీక్ సుబ్బరాజు నిర్మిస్తున్నారు.

## అశ్విన్ కెరీర్‌లో శివం భజే నిలిచిపోతుంది - విశ్వక్ సేన్


● అనిల్ రావిపూడి, విశ్వక్ సేన్, అశ్విన్‌బాబు, తమన్

''శివం భజే' ట్రైలర్ బాగుంది. నేపథ్య సంగీతం అదిరిపోయింది. ఆగస్టు 1న అశ్విన్‌కు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాను. తన కెరీర్‌లో 'శివం భజే' నిలిచిపోతుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవన్షీ జోడీగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రం 'శివం భజే'. మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 1న విడుదలవుతోంది. మంగళవారం జరిగిన 'శివం భజే' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి విశ్వక్ సేన్, డైరెక్టర్ అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు తమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''శివం భజే' ట్రైలర్ బాగుంది. యూనిట్‌కి ఈ చిత్రం మంచి విజయాన్ని అందించాలి'' అన్నారు అనిల్ రావిపూడి. ''అశ్విన్ క్రికెట్‌లో బాల్‌ను ఎలా బాదుతాడో బాక్సాఫీస్‌ను కూడా అలానే బాదాలి'' అన్నారు తమన్. ''పరమేశ్వరుడి కథతో రూపొందిన ఈ సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు అప్సర్. ''ముస్లిం అయిన అప్సర్‌గారు 'శివం భజే' లాంటి కథను ఎలా రాశారో అనుకున్నాను. ఇదంతా శివ లీల అనిపించింది'' అని అన్నారు అశ్విన్‌బాబు.

## ఆ ఫైర్‌తో డైరెక్టర్ అయ్యా! - బండి సరోజ్ కుమార్



''నేను గతంలో 'నిర్బంధం, నిర్బంధం 2 , మాంగల్యం' వంటి సినిమాలు తీశాను. వాటిని కొన్ని వర్గాల ప్రేక్షకులు మాత్రమే చూశారు. కానీ 'పరాక్రమం' చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులు చూడొచ్చు'' అని బండి సరోజ్ కుమార్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, నాగ లక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోపు, అనిల్ కుమార్ ఇతర పాత్రల్లో నటించారు. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందిన ఈ మూవీ ఆగస్టు 22న విడుదల కానుంది. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ– ''సంఘర్షణతో కూడుకున్న కథే 'పరాక్రమం'. నేను ఇండస్ట్రీకి రాక ముందు ఓ హాస్టల్‌లో ఉండేవాణ్ని. ఓ రోజు క్రికెట్ ప్రాక్టీస్ చేస్తుంటే.. 'క్రికెటర్ అవుతావా? మీ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఏంటి? వెనక చూసి ముందుకు వెళ్లాలి బ్రదర్' అని ఓ వ్యక్తి అన్న మాటలు నాలో కసిని నింపాయి. ఏదో ఒకరోజు అతను నన్ను తలెత్తుకుని చూడాలనుకున్నాను.. ఆ ఫైర్‌తోనే డైరెక్టర్ అయ్యాను'' అన్నారు.

## నాలుగువందల ఏళ్ల నాటి గుడి కథతో...


● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ఓ పురాతన గుడి ముందు తుపాకీ పట్టుకుని నిల్చున్నారు హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ఆ గుడి నాలుగు వందల ఏళ్ల క్రితం నాటిది. ఆ గుడికి హీరో ఎందుకు వెళ్లాలనుకుంటాడు? అనేది తెలుసుకోవడానికి కాస్త సమయం ఉంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో మహేశ్ చందు ఓ సినిమాను నిర్మిస్తున్నారు. దివంగత ప్రముఖ దర్శకులు కోడి రామకృష్ణ 75వ జయంతి, హీరో శ్రీనివాస్ ఇండస్ట్రీలోకి నటుడిగా వచ్చి పదేళ్లు పూర్తి కావడం... ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని ఈ సినిమాను మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే మొదలైంది. జూలై 24న రెండో షెడ్యూల్‌ను మొదలుపెట్టనున్నాం. కమర్షియల్ అంశాలతో కూడిన శక్తివంతమైన, ఆసక్తికరమైన కథను సిద్ధం చేశారు లుధీర్'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

## సరికొత్తగా కనిపిస్తాను - రక్షిత్ అట్లూరి



''పలాస 1978, నరకాసుర' చిత్రాల తర్వాత అన్నీ సీరియస్ రోల్స్ చేస్తున్నానని చాలామంది అన్నారు. కానీ 'ఆపరేషన్ రావణ్, శశివదనే' సినిమాల్లో నా పాత్రలు సీరియస్‌గా ఉండవు. ఈ సినిమాల్లో సరికొత్తగా కనిపిస్తాను. 'ఆపరేషన్ రావణ్' నన్ను ప్రేక్షకులకు మరింత దగ్గర చేసే సినిమా అవుతుంది'' అని రక్షిత్ అట్లూరి అన్నారు. వెంకట సత్య దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జంటగా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ– ''యువ ప్రేక్షకులకు చేరువ అయ్యేలా థ్రిల్లర్ మూవీ నిర్మిస్తే బాగుంటుందని 'ఆపరేషన్ రావణ్'ని తీశాం. ఈ మూవీ షూటింగ్ టైమ్‌లో మా నాన్న వెంకట సత్యంగారి డైరెక్షన్ పట్ల నాతో పాటు రాధిక, చరణ్ రాజ్‌గార్లు కూడా సంతోషంగా ఫీలయ్యారు. ఈ సినిమాలో మనలోని ఆలోచనల అంతర్యుద్ధాన్ని చూపించే ప్రయత్నం చేశాం. ఇలాంటి థ్రిల్లర్ సినిమాను థియేటర్‌లో చూస్తేనే ఆ అనుభూతి కలుగుతుంది. ప్రస్తుతం 'పలాస 2' స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది'' అన్నారు.

## ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రాజ్ తరుణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'పురుషోత్తముడు'. హాసినీ సుధీర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్, మురళీ శర్మ, రమ్యకృష్ణ, బ్రహ్మానందం, ముఖేష్ ఖన్నా ఇతర కీలక పాత్రల్లో నటించారు. రామ్ భీమన దర్శకత్వంలో డా. రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్ భీమన మాట్లాడుతూ– ''దర్శకుడిగా నేను 'ఆకతాయి, హమ్ తుమ్' అనే రెండు సినిమాలు చేశాను. ఆ తర్వాత ఆరేళ్లకు నాకు 'పురుషోత్తముడు' చాన్స్ వచ్చింది. విజయం సాధించాలనే పట్టుదలతో ఈ సినిమా చేశాను'' అన్నారు. ''మంచి క్లీన్ ఎంటర్‌టైనర్ మూవీ తీశామని గర్వంగా చెప్పగలం'' అన్నారు రమేశ్ తేజావత్. ''పురుషోత్తముడు'లో మంచి పోలీసాఫీసర్ రోల్ చేశాను. ఈ సినిమా సక్సెస్ కావాలి'' అన్నారు బ్రహ్మానందం. ''ఈ సినిమాలో నటించడాన్ని ఆస్వాదించా. రాజ్ తరుణ్ ఈ ప్రెస్‌మీట్‌కు రాలేదు. త్వరలోనే ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడతారు'' అన్నారు రాజా రవీంద్ర. ''నాది మహారాష్ట్ర. నన్ను తెలుగు అమ్మాయిలా ఆదరించాలని కోరుకుంటున్నాను. ఫ్యామిలీతో కలిసి ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు హాసినీ సుధీర్.


● హాసినీ సుధీర్